సాక్షి
అనకాపల్లి
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



ఆటాడుకుందాం రా..!

ఆటలు, పాటలు, క్రీడలు, వినోదం, విహారం.. అన్నింటికీ వన్‌స్టాప్ డెస్టినేషన్‌గా విశాఖ పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. 8లో



వైభవంగా చందనోత్సవం

కశింకోటలోని పురాతన వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. 8లో



ప్రశాంతంగా గురుకుల పరీక్షలు

ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలకు ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 8లో

న్యూస్‌రీల్

వుషు పోటీల్లో గోల్డ్ మెడల్



వుషు పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన కోరుకొండ అరుణ

తుమ్మపాల: అక్కిరెడ్డిపాలెం తారకరామ కాలనీకి చెందిన క్రీడాకారిణి కోరుకొండ అరుణ ఈ నెల 22, 23 తేదీలలో గుంటూరులో జరిగిన తొమ్మిదో ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ వుషు చాంపియన్‌షిప్–2023లో గోల్డ్ మెడల్ సాధించిందని కోచ్ ఆర్.వెంకటేష్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఆమె ఎంపికై త్వరలో పూణేలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

త్వరలో లక్ష్మీనారాయణుడి విగ్రహావిష్కరణ



చిన్నజీయర్‌స్వామితో మాట్లాడుతున్న కొణతాల బాబురావు

అనకాపల్లిటౌన్: విశాఖ నుంచి రాజమహేంద్రవరం జాతీయ రహదారిలో వెళుతున్న పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, శ్రీమన్నారాయణ రామనుజ చిన్న జీయర్ స్వామిని అనకాపల్లి మండలంలో జాతీయ రహదారి కొత్తూరులో రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కొణతాల బాబురావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామి ఆలయ సమీపంలో నూతనంగా 23 అడుగుల వైకుంఠ లక్ష్మీనారాయణ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, విగ్రహ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని స్వామీజీని కోరారు. చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ మంచి రోజులు చూసుకుని విగ్రహ ప్రతిష్ఠకు వస్తానని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసులు

అనకాపల్లిటౌన్: జిల్లాలో మద్యం, ఇసుక, గంజాయి, కోడిపందాలు, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలపై తమ సిబ్బంది దాడులు నిర్వహించడం జరిగిందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం తమ సిబ్బంది పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా చోడవరం, అనకాపల్లి మండలాల్లో గంజాయి రవాణా చేస్తున్న రెండు కార్లల్లో తరలిస్తున్న 104 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. సెబ్ అధికారులు ఏడు కేసులు నమోదు చేసి ఆరుగురిని అదుపులోనికి తీసుకుని, 13 లీటర్ల నాటుసారా, 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారని, 1,450 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 20మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మందిపై, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 71 మందిపై కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఎంవీ చలానాలు రూ.1,35,070 విధించినట్టు పేర్కొన్నారు.

ఇద్దరు అటవీ సిబ్బంది సస్పెన్షన్

నర్సీపట్నం: గొలుగొండ మండలం, సాలిక మల్లవరం అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలకు సంబంధించి ఇద్దరు అటవీ సిబ్బందిని సస్పెండ్ చేసినట్టు డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. అటవీ ప్రాంతంలో తవ్వకాలకు యత్నించారు తప్ప క్వారీలో నుండి వాహనాల్లో మట్టి తరలించినట్టు వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని డీఎఫ్‌వో తెలిపారు. ఈ నెల 21న క్వారీ ప్రాంతంలో పర్యవేక్షించాల్సిన స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది విధులకు హాజరుకాలేదని తన విచారణలో వెల్లడైందన్నారు. బీట్ ఆఫీసర్ లోవకుమార్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మహేష్‌ను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. తవ్వకాలకు సంబంధించి మరింత లోతుగా విచారణ చేస్తున్నామన్నారు.

27 నుంచి బిజినెస్ ఎక్స్‌పో

అక్కిరెడ్డిపాలెం : ఈ నెల 27, 28, 29వ తేదీల్లో విశాఖ ఆటోనగర్ డి – బ్లాక్ మెయిన్ రోడ్డులోని సరిపల్లి గ్రాండ్‌లో నిర్వహించనున్న ఇండస్ట్రియల్ కం బిజినెస్ ఎక్స్ పో – 2023 పారిశ్రామిక వేత్తలకు, వ్యాపార వేత్తలకు మంచి సదవకాశమని ఫ్లవరిష్ క్రియేషన్ యజ మాని డి.వినోద్ ఆదివారం తెలిపారు. పారిశ్రామిక, వ్యాపార, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనకు మంచి వేదికగా ఎక్స్ పో దోహదపడుతుందని తెలిపారు. వివరాలకు ఔత్సాహికులు 98855 17653, 81215 46144 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిజరూపం.. అపురూపం

- వైభవంగా అప్పన్న చందనోత్సవం
- భక్తజన సంద్రంగా మారిన సింహగిరి
- నిజరూపాన్ని తిలకించిన 2.25 లక్షల మంది భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- తొలి దర్శనం చేసుకున్న అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు



సింహగిరిపై స్వామి దర్శనానికి బారులు తీరిన అశేష భక్తజనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూపాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. ఏడాదికి ఒక్క రోజు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకుని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని అప్పన్న చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగుతో స్వామిపై ఉన్న 12 మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితున్ని చేశారు. తదుపరి విశేషపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసమేతంగా స్వామివారి తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం 3.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలను ప్రారంభించారు. స్వామి నిజరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.



చందనోత్సవానికి హాజరైన మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి పేర్ని నాని



గోపురం వద్ద అప్పన్న ఆకృతిలో పుష్పాలంకరణ

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి వెయ్యి కలశాలతో శ్రీ వైష్ణవస్వాములు గంగా జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. అలాగే 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలను స్వామివారికి అభిషేకించారు. తదుపరి స్వామికి విశేషంగా పూజలు నిర్వహించి తొలివిడతగా 120 కిలోల చందనాన్ని సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

చందనోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.

దర్శించుకున్న ప్రముఖులు

పలువురు ప్రముఖులు స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి పేర్ని నాని, దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధాగజపతిరాజు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.సోమయాజులు, జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ సుజాత, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ సత్యసుందర్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, నగర మేయర్ హరివెంకట కుమారి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు.

సింహాద్రినాథుడి ఆశీస్సులు ఉండాలి: మంత్రి అమర్‌నాథ్

రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. చందన స్వామి నిజరూప దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కంటే ఈ ఏడాది మెరుగైన పరిస్థితులు ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారన్నారు. వారందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించారన్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి: మంత్రి సీదిరి అప్పలరాజు

గతంలో కంటే ఈసారి ఎక్కువగా భక్తులు రావడంతో కొద్దిపాటి ఇబ్బందులు ఉన్నా ఏర్పాట్లు మాత్రం బాగా చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. ఆ స్వామి పాదాల చెంతన కొండదిగువ ఉన్న గురుకుల పాఠశాలలో తాను చదువుకున్నానని, తనకు సింహాద్రి అప్పన్న పేరు పెట్టారన్నారు.



స్వామి దర్శనానికి వస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

ప్రతి భక్తుడికీ సంతృప్తికరమైన దర్శనం

ప్రతీ ఒక్క భక్తుడు సంతృప్తికరంగా స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మొత్తంగా రోజంతా 2.25 లక్షల మంది భక్తులు నిజరూప దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖలు పక్కా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఘాట్‌రోడ్డులో ఒక వాహనం మరమ్మత్తులకు గురికావడంతో ట్రాఫిక్ రాకపోకలకు చిన్నపాటి అంతరాయం కలిగిందన్నారు. రెండు, మూడు స్లాట్‌ల్లో టిక్కెట్లు పొందిన భక్తులు ఒకేసారి దర్శనానికి రావడంతో రద్దీ ఏర్పడినట్టు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

భక్తులకు ఇక్కట్లు!

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణలో జిల్లా యంత్రాంగం, పోలీసులు విమర్శలను ఎదుర్కొన్నారు. అప్పన్న దర్శనానికి రూ.300, 1000, 1500 టికెట్లను ఆన్‌లైన్ ద్వారా జారీ చేశారు. ఈసారి చందనోత్సవానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. కానీ అంచనాలకు మించి 2.25 లక్షల మంది వచ్చారు. రాజగోపురానికి ఒకవైపు రూ.1500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు, మరోవైపు సిఫార్సు లేఖలతో రూ.1500 టికెట్లు పొందిన వీఐపీ ప్రొటోకాల్ భక్తులకు, బస్టాండు నుంచి రూ.వెయ్యి, 300 టికెట్ల వారికి, లోవతోట నుంచి ఉచిత ప్రవేశ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రూ.1500 టికెట్లు పొందిన వారికి అంతరాలయం దర్శనం కల్పిస్తామని ప్రకటించడంతో అధిక సంఖ్యలో ఈ టికెట్ల అమ్మకాలు జరిగాయి. అంతరాలయం దర్శనం సమయం ఎక్కువ పట్టడంతో ఈ క్యూలైన్లలో నిల్చున్న వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వీరిలో ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, ప్రముఖులు ఉన్నారు. ఈ రెండు క్యూలైన్ల మధ్య నుంచి వీఐపీల పేరిట వారి సంబంధీకులు గుంపులుగా రావడం, వారిని రాజగోపురం ద్వారా పోలీసులు అనుమతిస్తుండడం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆగ్రహం తెప్పించింది. బారికేడ్లను పెకిలించి రాజగోపురం ద్వారా ప్రవేశానికి దూసుకొచ్చారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అధికారులు, మధ్యాహ్నం నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేసి ఆలయ నీలాద్రి గుమ్మం నుంచి లఘు దర్శనం కల్పించారు. వీఐపీ, ప్రొటోకాల్ క్యూలైన్లలో భక్తులకు మంత్రి కొట్టు సత్యనారాయణ మజ్జిగ, మంచినీళ్లను అందించే ఏర్పాట్లు చేశారు. భక్తులతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది.

రాయితీపై కాకిజొన్న...సమీకృత దాణా

- పశు సంరక్షణకు ప్రభుత్వం తోడ్పాటు
- పశుగ్రాస సమస్యకు పరిష్కారంగా టీఎంఆర్ దాణా
- ఆర్బీకేల ద్వారా రాయితీపై దాణా, కాకిజొన్న గడ్డి విత్తనాల అందజేత



టీఎంఆర్ దాణా



కాకిజొన్న రకం గడ్డి సాగు

కె.కోటపాడు: వేసవికాలంలో పాడి రైతులకు పశుగ్రాస సమస్య ఎదురుకాకుండా ప్రభుత్వం అన్ని చర్యలను పశుసంవర్ధకశాఖ ద్వారా చేపడుతుంది. పశుగ్రాసం కొరత వల్ల పాల దిగుబడిపై ప్రభావం చూపడంతో పాటు పశువులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఈ సమస్యను అధిగమించేందుకు స్థానికంగా ఉండే రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే) ద్వారా రాయితీపై టోటల్ మిక్స్‌డ్ రేషన్(టిఎంఆర్) దాణాతో పాటు కాకిజొన్న గడ్డి విత్తనాలను అందించే చర్యలను తీసుకుంటున్నారు. అనకాపల్లి జిల్లాలో 2022–23 కాలంలో రైతులకు 3169 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ దాణా, 27.339 మెట్రిక్ టన్నుల కాకిజొన్న రకం గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు.

60 శాతం రాయితీ

జిల్లాలో టీఎంఆర్ దాణా, కాకి జొన్న రకం గడ్డి విత్తనాలను ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు ఇప్పటికే రాయితీపై అందించే చర్యలను చేపట్టారు. బయట మార్కెట్‌లో టీఎంఆర్ దాణా కిలో ఖరీదు రూ.15.80 ఉండగా 60 శాతం రాయితీపై రైతులకు కిలో రూ. 6.50లకే అందిస్తున్నారు. కాకిజొన్న రకం గడ్డి విత్తనాలు 5 కిలోల ధర మార్కెట్‌లో రూ.460 ఉండగా, రైతులకు 75 శాతం రాయితీపై 5 కిలోలను కేవలం రూ.115లకే అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో టీఎంఆర్ దాణాను 3169 టన్నులను రాయితీపై రైతులకు అందించగా, కాకిజొన్న విత్తనాలను 2022–23 కాలంలో 55.745 మెట్రిక్ టన్నులను సిద్ధం చేసి, 27.339 మెట్రిక్ టన్నుల విత్తనాలను రైతులకు అందించారు. ప్రస్తుతం ఆర్బీకేలలో 27.395 టన్నుల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. కాకిజొన్న రకం గడ్డిని పశువులు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయి. వేసవిలో పశుసంరక్షణకు ప్రభుత్వం తోడ్పాటు అందించడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతున్నది.

ఆర్బీకేల ద్వారా దాణా సరఫరా



టీఎంఆర్ దాణా, కాకిజొన్న రకం గడ్డి విత్తనాలను రాయితీపై పొందే రైతులు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో గల పశువైద్య సహాయకులను సంప్రదించాలి. రాయితీ పోను మిగిలిన నగదును అందించి వీటిని పొందాలి. రైతులకు ఆయా కేంద్రాల వద్దనే వీటిని అందిస్తాం. ఇతర ప్రాంతాలకు రైతులు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లో గల ఆర్బీకేల ద్వారానే రైతులకు అందిస్తున్నాం.

–బి.ప్రసాదరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, అనకాపల్లి

రోజంతా ఎంజాయ్ చేసేలా..

- అందుబాటులోకి రానున్న కార్వాన్ పర్యాటకం
- తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించేందుకు సన్నాహాలు
- వాహనం సైజును బట్టి ప్యాకేజీలు



కార్వాన్లు

సాక్షి, విశాఖపట్నం : ట్రెండింగ్ టూరిజం వైపు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచ దేశాల్లోనూ, మన దేశంలో వివిధ ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటున్న కార్వాన్ పర్యాటకం ఉమ్మడి విశాఖజిల్లాలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు ఇందుకు సంబంధించి నివేదిక సిద్ధం చేశారు. టూరిజంలో సరికొత్త విప్లవానికి సన్నాహాలు చేస్తున్నారు. తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

కార్వాన్లను అందుబాటులోకి తెచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, ఆర్‌డీ శ్రీనివాస్‌పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి, నివేదికలు సిద్ధం చేశారు. లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో ప్రకృతిని ఆస్వాదించేందుకు కార్వాన్లలో టెంట్లు కూడా ఉంచాలని భావిస్తున్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కానున్న వీటికి వాహనాన్ని బట్టి ప్యాకేజీలు నిర్ణయిస్తారు.

మినీ లగ్జరీ హోమ్‌లా...

ప్రతిపాదనల దశలో ఉన్న కార్వాన్లు లగ్జరీ హోమ్‌లు మాదిరిగా అన్ని సౌకర్యాలు ఉంటాయి. లాంజ్ కమ్ బెడ్‌రూమ్, కిచెన్, రెస్ట్‌రూమ్‌లుంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టౌ, ఫ్రిడ్జ్, ఫ్రీజర్‌లో వంటగది, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్, రూఫ్‌టాప్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీలు, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వివిధ సైజుల్లో కార్వాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది. ఎంపిక చేసుకున్న వాహనాన్ని బట్టి ప్యాకేజీ ఉంటుందని పర్యాటకశాఖ చెబుతోంది.

అభివృద్ధికి పట్టుగొమ్మలు

పట్టణాలకు గ్రామీణ ప్రాంతాలు పట్టుగొమ్మల్లాంటివి, జాతిపిత గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో నెరవేరుతోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి కుంటుపడుతూనే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పాలన ప్రజలకు మరింత చేరువ కావాలని గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి నాలుగేళ్లుగా పాలన సాగిస్తోంది. అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకే సకాలంలో పథకాలు అందించిన ఘనత దక్కించుకుంది. ఈ దిశలో ప్రగతి సుమాలు విరిసి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన రెండు గ్రామాలు కీర్తికిరీటాలు సొంతం చేసుకున్నాయి.



ఉత్తమ అవార్డుకు ఎంపికైన తారువ గ్రామం

తారువ.. అభివృద్ధిలో చెరగని ముద్ర

- ఆదర్శంగా డిప్యూటీ సీఎం బూడి స్వగ్రామం తారువ
- ఉత్తమ ఆరోగ్య పంచాయతీ అవార్డుకు ఎంపిక
- నేడు విజయవాడలో అవార్డు అందుకోనున్న సర్పంచ్, కార్యదర్శి



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఉత్తమ ఆరోగ్య గ్రామ పంచాయతీగా దేవరాపల్లి మండలంలోని తారువ పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో భాగంగా విజయవాడలో సోమవారం జరిగే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి అందజేయనున్నారు. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తారువ గ్రామ సర్పంచ్ గొంప వరహాలమ్మ, పంచాయతీ కార్యదర్శి పి.అప్పలనాయుడు విజయవాడకు ఆదివారం బయలుదేరి వెళ్లారు. స్వగ్రామమైన తారువ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ తన తండ్రి బూడి వెంకునాయుడు సుదీర్ఘ కాలం పాటు సర్పంచ్‌గా విశేష సేవలందించి గ్రామాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పథంలో నడిపించి చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. తాను కూడా అదే బాటలో పంచాయతీ వార్డు మెంబర్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి వరకు ఎదిగిన క్రమంలో తారువ అభివృద్ధికి పెద్దపీట వేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దానన్నారు. ఏళ్ల క్రితమే దాదాపుగా తమ పంచాయతీలో ప్రతి వీధికి సీసీ రోడ్లతో పాటు ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా చిన్నపాటి సీసీ డ్రైనేజీలు నిర్మించడంతో అప్పట్లోనే తారువ జిల్లాలో రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. నిత్యం తాగునీటి సరఫరా, ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. గ్రామంలో కల్యాణ మండపం, ఆడిటోరియం తదితర మౌలిక సదుపాయాలు తారువ సొంతమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో సైతం నేటికీ గ్రామాభివృద్ధిని నిత్యం స్వయంగా పర్యవేక్షిస్తానని, ఈ నేపథ్యంలోనే కుగ్రామమైన తారువ రాష్ట్ర చిత్రపటంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. ఆధ్యాత్మికతలో సైతం తారువ ముందు వరుసలో నిలుస్తుందన్నారు. తారువ జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామాభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతోనే ఇది సాధ్యపడిందని గ్రామస్తులు చెబుతున్నారు.

మార్టూరు.. మహిళా దీప్తి

మహిళా స్నేహ పురోగతి అవార్డుకు ఎంపికైన గ్రామం



మార్టూరు గ్రామ పంచాయతీ

అనకాపల్లిటౌన్ : నూతనంగా ఏర్పడిన జిల్లాలో అనకాపల్లి మండలంలో మార్టూరు గ్రామానికి మహిళా స్నేహ పురోగతి గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. సుమారుగా 5వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామం చుట్టూ పెద్దపెద్ద కొండలు ఉండడంతో పాటు, గ్రామంలో పనిచేస్తున్న ప్రతి మహిళా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను తీసుకుంటూ ఆర్థికంగా కుటుంబం ఎదుగుదలకు గ్రామ మహిళలు కృషి చేస్తున్నారు. మహిళా స్నేహపురోగతి అవార్డు కింద గ్రామ అభివృద్ధికి కొంత నగదును ప్రభుత్వం అందజేస్తుంది. సచివాలయం, పంచాయతీ, వివిధ విభాగాల అధికారులు, స్థానిక ప్రజల సమష్టి కృషి ప్రతిఫలంగా ఈ ఘనత దక్కింది.

గ్రామ ప్రజల కృషి వల్లే అవార్డు



రెక్కాడితే గాని డొక్కాడని గ్రామం మార్టూరు. కుటుంబ సమేతంగా గ్రామ ప్రజలు వివిధ ప్రాంతాల్లో పనులు చేసుకుంటారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తరువాత గ్రామ మహిళలు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ద్వారా అందజేస్తున్న నగదును తీసుకుని గ్రామంలో ఇంటి వద్దనే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటా జీవిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలు మేరకు వచ్చే ఏడాది కేంద్ర అవార్డును తీసుకునేందుకు గ్రామ ప్రజల సహకారంలో మరింత అభివృద్ధికి కృషి చేస్తాను.

–వి.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, మార్టూరు

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

యలమంచిలి: యలమంచిలి పట్టణం, రామచంద్రమ్మ కాలనీ, కాకివానివీధికి చెందిన బంగారి నూకరాజు (39) అనే వ్యక్తి ఆదివారం కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. కుటుంబ సభ్యులు యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని ఆయన తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, కొంత కాలంగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడని తెలిపారు. తల్లి సంరక్షణలో ప్రస్తుతం జీవనం సాగిస్తున్న నూకరాజు ఆదివారం అనారోగ్యం కారణంగా కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు.

డివిజన్ పరిధిలో అభివృద్ధిపై సమీక్ష



ఆర్‌వీఎన్‌ఎల్ గతిశక్తి అధికారులతో మాట్లాడుతున్న రూప్ నారాయణ్ సుంకర్

తాటిచెట్లపాలెం: వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రైల్వే బోర్డు మెంబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెంబర్ రూప్‌నారాయణ్ సుంకర్ పరిశీలించారు. వివిధ శాఖ అధికారులతో డీఆర్‌ఎం అనూప్ కుమార్‌సత్పతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ముందుగా విశాఖలోని రైల్ వికాస్‌నిగం లిమిటెడ్, గతిశక్తి ప్రాజెక్టు నిర్మాణ విభాగ సిబ్బందితో వివిధ పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం కేకే లైన్, విశాఖ-బొడ్డవర సెక్షన్‌లో విండో ట్రయిలింగ్ తనిఖీ నిర్వహించారు. మలుపులు, వంతెనలు, గుహలు, క్రాసింగ్స్, రెండో లైన్ పనులు, రైళ్ల వేగం, భద్రత వంటి అంశాలను ఆయన పరిశీలించారు. ట్రాక్ నిర్వహణ, ట్రాక్ అలైన్‌మెంట్ సామర్థ్యం పెంపుదల కోసం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన రైల్ మిల్లింగ్ మెషీన్‌ను బొడ్డవరలో ఆయన ప్రారంభించారు. దీని పనితీరును పరిశీలించారు.

వైభవంగా చందనోత్సవం

- కశింకోటలో వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం
- పెద్ద ఎత్తున హాజరైన భక్తులు



కశింకోటలో వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజ రూపం



లక్ష్మీనృసింహస్వామికి చందనంతో అభిషేకాలు

కశింకోట: స్థానిక పురాతనమైన ఆలయంలో వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ తదియ పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా అయినవిల్లి నుంచి వచ్చిన వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. ఏడాది పొడవునా చందన రూపంలో దర్శనమిచ్చే స్వామివారు ఒక్క రోజు సంప్రదాయంగా చందనాన్ని తొలగించి నిజ రూపంతో దర్శనమివ్వడంతో భక్తిపారవశ్యంతో తన్మయత్వం చెందారు. భక్తులు తెచ్చిన పూజా ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, పాలు, చెరకు రసం, పెరుగు, నెయ్యి, పంచదార, తేనె, పండ్ల రసాలు వగైరా వాటితో స్వామి నిజ రూపానికి దఫ దఫాలుగా అభిషేకాలు నిర్వహించారు. పూలతో అర్చించి అందంగా అలంకరించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దర్శించుకున్నారు. అనంతరం నిజ రూపానికి గంధం పూసి చందన స్వామిగా యధావిధిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి దర్శనాలు కల్పించారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

అయ్యన్నపాత్రుడు ప్రోత్సాహంతోనే రంగురాళ్ల తవ్వకాలు

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: రంగురాళ్ల గురించి మాట్లాడే అర్హత టీడీపీ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు లేదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ×రంగురాళ్ల ద్వారా ఒక్క రూపాయి నేను సంపాదించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, లేదంటే మీరు తప్పుకుంటారా₹ అని సవాల్ విసిరారు. ×రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహించింది నువ్వు, నీ కొడుకేనని₹ విమర్శించారు. పండగలు, పబ్బాలు ముసుగులో రంగురాళ్ల వ్యాపారుల నుంచి లక్షల రూపాయలు దోచుకున్నారని దుయ్యబట్టారు. నర్సీపట్నం నియోజకవర్గంలో అటవీ ఖనిజ సంపదను ఇష్టానుసారంగా కొల్లగొట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాతవరం మండలం, సరుగుడులో లక్షల టన్నుల లేటరైట్‌ను కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తారని ధ్వజమెత్తారు. అనేక సార్లు మంత్రిగా వెలగబెట్టి నర్సీపట్నాన్ని గంజాయికి అడ్డాగా మార్చారన్నారు. సాలికమల్లవరంలో రంగురాళ్ల తవ్వకాలు జరగలేదని అటవీ శాఖాధికారులు చెప్తున్నా, రాజకీయ లబ్ధి కోసం తనపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు చేసిన టీడీపీ నాయకులను అరెస్టు చేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు

5వ తరగతికి 33 మంది, ఇంటర్ ఫస్టియర్‌కు 13 మంది గైర్హాజరు



తెనుగుపూడిలో గురుకులం పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-2024 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 474 మందిగాను 441 మంది విద్యార్థులు హాజరయ్యారు. 33 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ పరీక్షకు 81 మంది విద్యార్థులకు 13 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులతో స్థానిక గురుకుల పాఠశాల పరిసరాలు కోలాహలంగా మారాయి.



తాళ్లపాలెం గురుకులంలో పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా గురుకుల సమన్వయకర్త రూపావతి

పరిశీలించిన సమన్వయకర్త రూపావతి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఆదివారం వేర్వేరుగా నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు విశాఖ జిల్లాలో 553 మంది, అనకాపల్లి జిల్లాలో 2,297 మంది వంతున, ఇంటర్మీడియట్‌లో విశాఖ జిల్లాలో 334 మంది, అనకాపల్లి జిల్లాలో 1,166 మంది వంతున విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఉభయ జిల్లాల్లోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించానని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం పరీక్ష కేంద్రాల వద్ద ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అవార్డులకు రెండు పంచాయతీల ఎంపికపై హర్షం

అనకాపల్లి టౌన్: జిల్లాలో రెండు పంచాయతీలు పంచాయతీరాజ్ రాష్ట్ర స్థాయి అవార్డులను దక్కించుకోవడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాలో అనకాపల్లి మండలంలో మార్టూరు పంచాయతీకి, దేవరాపల్లి మండలం తారువ పంచాయతీకి రాష్ట్ర అవార్డులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రదానం చేస్తారన్నారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో రెండు పంచాయతీలు రాష్ట్ర అవార్డులకు ఎంపికవడమే కాకుండా జిల్లా అవార్డులకు అనకాపల్లి మండలం నుంచి మార్టూరు, కొత్తూరు, గోపాలపురం పంచాయతీలను ఎంపిక చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

'స్పాట్ కేంద్రంలో సౌకర్యాలు పెంచండి'

అనకాపల్లి రూరల్: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం కేంద్రం ఏఎంఏఎ హైస్కూల్లో సదుపాయాలు సరిగా లేవని పలువురు ఉపాధ్యాయులు ఆరోపించారు. తగినన్ని వాష్‌రూమ్‌లు లేవని ఆక్షేపిస్తున్నారు. తరగతి గది సామర్థ్యానికి మించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో తగినన్ని లైట్లు, ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నారని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సదుపాయాలను మెరుగుపరచాలని, మంచినీరుతోపాటు మజ్జిగ సరఫరా చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం



గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన పూరిపాక

తుమ్మపాల: అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమయింది. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి ఆనుకుని రేబాక జంక్షన్‌కు సమీపంలో అడ్డురోడ్డు ప్రాంతం గోకులపాడుకు చెందిన పిల్లి అప్పలకొండ తన కుటుంబంతో వలస వచ్చి కమ్మల పాకలో నివాసముంటున్నాడు. ఆదివారం సాయంత్రం టీ చేసుకునేందుకు గ్యాస్ సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పాక అంటుకుంది. దీంతో పాకలో ఉంటున్న పిల్లి అప్పలకొండ, అతడి భార్య వెంటనే పరుగులు తీసి బయటకు వెళ్లిపోయారు. కొన్ని నిమిషాల్లోనే గ్యాస్ సిలిండర్ పేలి 100 అడుగుల ఎత్తున ఎగిరింది. దీంతో స్థానికులు భయందోళనకు గురై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ వాహనంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పిల్లి అప్పలకొండ వృత్తిరీత్యా కల్లు గీత కార్మికుడు. వేసవిలో కల్లు గీత ద్వారా వచ్చిన డబ్బును పాకలోనే దాచుకున్నాడు. రూ.50 వేలు అగ్నికి బుడిదయ్యాయని తెలిపాడు. ఇంటి సామాగ్రి, వంట సరుకులు మొత్తం కాలిపోవడంతో కట్టుబట్టలతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

యానాం మద్యం సీసాలు స్వాధీనం

మద్యం విక్రేత అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్‌ఈబీ పోలీసులు

గొలుగొండ: ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలను విక్రయిస్తుండటంపై గొలుగొండ ఎస్‌ఈబీ పోలీసులు ఆదివారం దాడులు చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ సీఐ రాజారావు వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన కొత్తిన ప్రసాద్ తన ఇంటి వద్ద ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు(ఫుల్ బాటిళ్లు) ఉన్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశారు. అతడిని అరెస్టు చేసి యానాం(పుదుచ్చేరి)కు చెందిన 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఎవరైనా బాధ్యులు ఉంటే అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కారు ఢీకొట్టి విరిగిపోయిన స్తంభం

మాకవరపాలెం: విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారు మాకవరపాలెం వైపు నుంచి నర్సీపట్నం వెళ్తుండగా, కొండలఅగ్రహారం వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని శనివారం అర్ధరాత్రి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. అక్కడ స్తంభానికి కొద్ది దూరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొని ఉంటే భారీ ప్రమాదం జరిగేది. ఇదిలా ఉండగా స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అప్రమత్తమైన ఆ శాఖ అధికారులు ప్రత్యామ్నాయంగా సరఫరాను పునరుద్ధరించారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కార్పొరేషన్ డైరెక్టర్ జగన్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జంగమ ప్రతినిధులు

చోడవరం: వెనుకబడిన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరానికి చెందిన అత్తిలి జగన్‌మోహనరావును ఇటీవల రాష్ట్ర జంగమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయనకు జిల్లా జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చోడవరంలో ఆదివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను శాలువాలు, పూలదండలతో సత్కరించారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన కులాలైన బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందన్నారు. గతంలో బీసీలను అడ్డు పెట్టుకొని అధికారంలోకి వచ్చిన టీడీపీ వారిని అన్ని విధాలుగా అణగదొక్కిందని ధ్వజమెత్తారు. అదేవిధంగా పార్టీకి కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. జంగమ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రా..!

- అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా వేదికలు
- 6 క్రికెట్ పిచ్‌లు, 8 బ్యాడ్మింటన్, 4 వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టుల ఏర్పాటు
- వాటర్ పార్క్, ఫన్‌జోన్, గోకార్టింగ్, స్నోవరల్డ్, వీఆర్ గేమ్స్
- ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనేలా ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా పోర్టు స్టేడియం
- మే 1 నుంచి 30కి పైగా యాక్టివిటీస్‌లో భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహణ
- జాతీయ స్థాయిలో కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమాలు



VISHWANADH SPORTS CLUB

దొండపర్తి (విశాఖ దక్షిణ): రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే గోకార్టింగ్ రేసింగ్ కార్లు.. సాహసాలు క్రీడల ఔత్సాహితుల కోసం అడ్వెంచర్స్ పార్క్.. అలుపెరగని ఆటలకు వాటర్ పార్క్.. పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు ట్రాంపోలిన్ పార్క్.. విశాఖలో హిమపాతం అనుభూతిని కలిగించేలా స్నో వరల్డ్.. అద్భుత ప్రపంచాన్ని కళ్లముందే సాక్షాత్కారమిచ్చేలా వర్చువల్ గేమింగ్ జోన్.. క్రికెట్ నుంచి ఆర్చరీ వరకు అన్ని రకాల అవుట్‌డోర్, ఇండోర్ క్రీడలకు సంబంధించిన వేదికలు.. మానసిక ఉల్లాసానికి సిమ్మింగ్ పూల్.. వాకర్స్ కోసం జాగింగ్ ట్రాక్.. ఇండోర్, అవుట్‌డోర్ జిమ్స్.. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా యాంఫీ థియేటర్.. ఇలా ఒకటేమిటి.. ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం.. అన్నింటికీ వన్‌స్టాప్ డెస్టినేషన్‌గా పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటి వరకు క్రీడా మైదానంగానే ఉన్న ఈ స్టేడియాన్ని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు స్పోర్ట్స్, ఫన్, అమ్యూజ్‌మెంట్, అడ్వెంచర్స్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు అనేక రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రతి ఒక్కరికీ విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఒక టూరిస్ట్ స్పాట్‌గా స్టేడియంలో సర్వ హంగులు అద్దుతున్నారు.

మే 1 నుంచి భారీ సమ్మర్ క్యాంప్

విశాఖలోనే అతి పెద్ద సమ్మర్ క్యాంప్ నిర్వహణకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ ఎవరూ చేయని విధంగా దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీల సహకారంతో ఒకేసారి 30కిపైగా క్రీడా, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మే 1వ తేదీ నుంచి ఆరు వారాల పాటు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో ప్రత్యేక స్పోర్ట్స్ పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఒకేసారి 1500 వరకు ఈ శిబిరంలో క్రికెట్ నుంచి కర్రసాము వరకు.. టెన్నిస్ నుంచి కుకింగ్ వరకు.. డ్యాన్స్ నుంచి డిబేట్స్ వరకు.. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లలో జాతీయ స్థాయి కోచ్‌లతో క్యాంప్‌లో చేరిన వారికి శిక్షణ ఇవ్వనుంది. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడలపై మక్కువ పెంచడంతో పాటు, క్రీడా నైపుణ్యాన్ని మరింత పదును పెట్టుకోడానికి ఈ శిక్షణా శిబిరం దోహదపడనుంది. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉండనుంది. ఆసక్తి ఉన్న వారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలను ఎంచుకొనే అవకాశముంది. వారానికి రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అభ్యర్థులకు అనువైన బ్యాచ్‌లలో చేరే అవకాశముంది.

క్రీడామైదానంతో పాటు అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా..

పోర్టు స్టేడియాన్ని క్రీడా మైదానంగానే కాకుండా విశాఖలోనే సరికొత్త అమ్యూజ్ మెంట్ హబ్‌గా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒకవైపు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచే సే విధంగా ఇక్కడ అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికలను సిద్ధం చేస్తోంది. క్రికెట్‌తో పాటు 8 బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, 4 వాలీబాల్ కోర్ట్‌లను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. అలాగే క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కోచ్‌లను తీసుకువచ్చి ఇక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ పోర్టు స్టేడియాన్ని ఒక క్రీడా వేదికగానే కాకుండా అన్ని వయసుల వారికి అనువైన, ఆరోగ్యం, విహారం, వినోదం పంచే అమ్యూజ్‌మెంట్ హబ్‌గా రూపొందిస్తోంది.

ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో..

ఆరు నెలల్లో పోర్టు స్టేడియాన్ని పూర్తి స్థాయి స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ మారనుంది. పిల్లల కోసం ఫన్ జోన్, ట్రాంపోలిన్ పార్క్, మౌంటేన్ క్లైంబింగ్, సిమ్మింగ్ పూల్, స్నో వరల్డ్, బాక్స్ క్రికెట్ వంటి సౌకర్యాలు త్వరలోనే అందరినీ అలరించనున్నాయి. అలాగే వాకర్స్ కోసం కూడా జాగింగ్ ట్రాక్‌తో పాటు అవుట్‌డోర్, ఇండోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కళాకారుల ప్రదర్శనలకు అనువుగా యాంఫీ థియేటర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతమున్న కళావాణి ఆడిటోరాయాన్ని మరింత ఆధునీకరించనున్నారు.



ఆర్చరీలో పోటీపడుతున్న చిన్నారులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారిణులు

పూల్ ఏ : అవుట్‌డోర్
క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ.

పూల్ బీ: ఇండోర్
టేబుల్ టెన్నిస్, చెస్, కరాటే, రైఫిల్ షూటింగ్, టైక్వాండో(బాయ్స్ అండ్ గర్ల్స్), కర్రసాము, ఫెన్సింగ్

పూల్ సీ: ఆర్ట్స్ అండ్ కల్చర్
డ్యాన్స్, మ్యూజిక్, సింగింగ్, యాక్టింగ్, యోగా, పెయింటింగ్, కుకింగ్.

పూల్ డీ: ఎడ్యుకేషన్ అండ్ ఫన్
సైన్స్ పరిశోధనలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం, భారత చరిత్ర, రోబోటిక్స్, ట్రెజర్ హంట్, గార్డెనింగ్, డిబేట్ అండ్ గ్రూప్ డిస్కషన్స్.

బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్



పోర్టు స్టేయాన్ని బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా వేదికలే కాకుండా.. అన్ని వయసుల వారిని అలరించి, వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌గా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో మే 1వ తేదీ నుంచి భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా మంది పోర్టు స్టేడియానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో ఆరు నెలల్లో స్పోర్ట్స్, ఫన్ యాక్టివిటీస్ అందరినీ అలరిస్తాయి.

– ప్రమోద్, మేనేజింగ్ డైరెక్టర్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్













చిరు ధాన్యాల్లో మేటి రాగులు

- తక్కువ పెట్టుబడితో సాగుపై రైతుల ఆసక్తి
- ఆరోగ్యకర ఆహారంతో పెరుగుతున్న డిమాండ్


వెన్నుల నుంచి సేకరించి శుభ్రం చేస్తున్న రాగి గింజలు


కశింకోటలో పూత దశలో ఉన్న రాగుల పంట

కశింకోట : మండలంలో రబీలో సాగు చేసిన రాగి(చోడి) పంట ఆశాజనకంగా ఉంది. కొన్ని చోట్ల పూత దశలో ఉంది. రాగి పంటను మండలంలోని రైతులు ఆహారంగా వాడుకోవడానికి ఎక్కువ మంది పండిస్తున్నారు. మరికొందరు అమ్ముకుని ఆదాయం పొందేందుకు సాగు చేస్తున్నారు. మండలంలో రాగి పంటను ఎక్కువగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తారు. మెట్ట ప్రాంతాల్లోనే ఎక్కువగా పండిస్తారు. ఆ తర్వాత రబీలో బోర్లు, చెరువులు, నీటి సదుపాయం ఉన్న వారు చిన్న కమతాల్లో పండిస్తారు.

నాలుగు మాసాల్లో పంట చేతికి

స్థానికంగా సుమారు 100 మంద రైతులు దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. మూడు నుంచి నాలుగు నెలల్లో పంట చేతికి వస్తుంది. ఎక్కువ పెట్టుబడి పెట్టనక్కర్లేదు. కనీసం రెండుసార్లు నీటి తడి పెడితే చాలు. పంట పండితే గింజలతోపాటు పశువులకు గడ్డి కూడా సమకూరుతుంది. దీంతో రైతులు దీని సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. చిరు ధాన్యాల్లో రాగులకు మంచి డిమాండ్ ఉంది. ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యపరంగా మంచిదని ప్రకృతి వ్యవసాయంలో రాగి పంట సాగును ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది. ఇది రక్త హీనత నివారణకు, కాల్షియం అందించేందుకు ఉపకరిస్తుందని వైద్యులు అంటున్నారు. అందుకే పాఠశాలల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ ఇవ్వడం ఇటీవల ప్రారంభించింది.

ఆహార పంటగానే సాగు

కొంత మంది రైతు కుటుంబాలు తమకు మొదటి నుంచి ఆహారంగా తీసుకుంటుండటంతో రాగుల సాగు పట్ల మొగ్గు చూపుతున్నారు. రాగుల వినియోగానికి ప్రజల్లో డిమాండ్ ఉండటంతో ఈ పంట సాగు పట్ల మరికొందరు రైతులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం రబీ సాగుగా కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తదితర ప్రాంతాల్లో రాగిని పండిస్తున్నారు. అయితే రాగుల్ని పొట్టు తీసిన తర్వాత మాత్రమే కొనుగోలు చేస్తామని వ్యాపారులు అంటున్నారు. పొట్టుతో తీసుకెళితే కొనేందుకు మొగ్గు చూపట్లేదు. పొట్టు తీయడానికి మిల్లులు ఇక్కడ అందుబాటులో లేవు. దీంతో పొట్టుతోనే రాగి గింజలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మార్కెటింగ్ విస్తరించాలి



ఈ ఏడాది పూత సమయంలో అకాల వర్షాలు రావడంతో దిగుబడి తగ్గింది. ఎకరం భూమిలో రాగి పండించాను. దీన్ని అమ్ముకోవడానికి మార్కెటింగ్ సదుపాయం లేదు.పొట్టు తీసే యంత్రం అందుబాటులో లేదు. దీంతో అమ్ముకునే అవకాశం లే కపోతోంది. పొట్టుతో రాగి గింజలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సూరిశెట్టి లోకేష్, రైతు, కశింకోట.

ఆహారం కోసమే సాగు



ఆరోగ్యానికి, ఆహారంగా వినియోగించేందుకు మంచిది. దీంతో రాగుల్ని సుమారు 30 ఏళ్లుగా ఖర్చుకు వెనుకాడకుండా సాగు చేస్తున్నాను. మూడు నుంచి నాలుగు నెల ల్లో పంట చేతికి వస్తుంది. దీన్ని కూడదీసు కుని గింజలతో ఏడాది పొడవునా ఆరోగ్యానికి ఉపకరించే రాగి జావ తయారు చేసుకుంటాం. మొదటి నుంచి రాగి జావ తాగడం అలవాటు.

– కాండ్రేగుల నరసింగరావు, కౌలు రైతు, కశింకోట

పెట్టుబడి తక్కువ

మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో రాగి పంట సాగు చేస్తుంటారు. ఖరీఫ్‌లో మెట్ట ప్రాంతాల్లోను, రబీలో నీటి సదుపాయం ఉన్న చోట పంట సాగు చేస్తారు. ఎక్కువగా రైతులు చిన్న కమతాల్లో పంట సాగు చేస్తారు. పెట్టుబడి తక్కువగా ఉండటం, త్వరగా పండి చేతికి రావడంతో పంట సాగు చేస్తుంటారు. ప్రస్తుతం రబీలో కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు.

– ఎ.శ్రీను, ఏఈవో, కశింకోట.

ఘనంగా మానస నాగమ్మ ఆలయ వార్షికోత్సవం


అన్నసమారాధన ప్రారంభిస్తున్న మందపాటి జానకీరామరాజు

అనకాపల్లిటౌన్ : స్థానిక బర్మా కాలనీలో శ్రీ మానస నాగమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తెల్లవారు జామునుంచి నాగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు నాగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని జానకీరామరాజు ప్రారంభించారు. సుమారుగా 1000 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు మృతి

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు ఆదివారం మరణించారు. అనకాపల్లి పార్లమెంటు నియోజక వర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ గ్రామానికి చేరుకుని నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించా రు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు అబ్బాయిలున్నారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు ఉన్నారు.

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో 9 విభాగాల్లో మండల స్థాయిలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన పంచాయతీలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు అందిస్తామన్నారు. సర్పంచ్‌లు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు


బోకం సూర్యనారాయణ తదితరులను కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు బోకం సూర్యనారాయణ రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సూర్యనారాయణతో పాటు 3వ వార్డు మెంబర్ బోకం సింహాచలమ్మ, మాజీ వార్డు మెంబర్ బోకం జగదీశ్వరరావు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సబ్బవరం వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఉప సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ దేముడు బాబు, సచివాలయ కన్వీనర్ ఎర్రినాయుడు, సబ్బవరపు శ్రీను, గొంప రమణ, శ్రీరామమూర్తి, బోకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, ఎన్టీపీసీ దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులు తీరంలో ఆట పాటలతో సందడి చేశారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం ఇక్కడ వంతెన కింద సేదతీరారు. సాయంత్రం తీరంలో జలక్రీడలతో ఎంజాయ్ చేశారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం

భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీలో స్వచ్ఛంద సంస్థలు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు


క్యూలైన్లలో దర్శనానికి వెళ్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన విజయనగరం, విశాఖ, పాడేరు, శ్రీకాకుళం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు ఎక్కువగా హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది, ఆనందంగా తిరుగుముఖంపట్టారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అధికారులు భక్తులకు మజ్జిగ, మంచి నీరు అందించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అవసరమైన సాయం చేశాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పట్టణ సీఐ దాడి మోహన్‌రావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

‘సంక్షేమ సారథిని గెలిపించుకుందాం’


తాళ్లపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం మేరపురెడ్డి వారి వీధి, సినిమాహాలు వీధుల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య పాలనలో వ్యత్యాసాలను గమనించి, సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని అభ్యర్థించారు. లబ్ధిదారుల అంగీకారంతో వారిళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ పేరిట ముద్రించిన స్టిక్కర్లను అతికించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రూపొందించిన బ్రోచర్లను అందించారు. గృహ సారథులు, వలంటీర్లు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘టెన్త్ సైన్స్ పరీక్ష వేర్వేరుగా నిర్వహించాలి’

అనకాపల్లిటౌన్ : పదో తరగతి విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం(ఎన్ఎస్) పరీక్షలను వేర్వేరుగా నిర్వహించాలని జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రైవేట్ భవనంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు ఎంఎస్‌వీఎస్‌పీ వర్మ, కె.కాళిదాసులు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షల్ని సబ్జెక్టుల వారీ ఒక్కో పేపర్‌గా నిర్వహించడం అభినందనీయమన్నా రు. అయితే విద్యార్థులు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు ఒకేరోజు రాయడంలో ఇబ్బందులు పడుతన్నారని, వీటిని వేర్వేరుగా నిర్వహించాల్సిందిగా వినతిపత్రంలో కోరారు.

ఘనంగా పరశురామ జయంతి

తుమ్మపాల : పరశురాముని జయంతి సందర్భంగా పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పరశురామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళా కార్యవర్గ సభ్యులను పసుపు కుంకుమలతో గౌరవించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పేరూరి బోగలింగేశ్వరశర్మ, మండల అధ్యక్షుడు నాగలింగశాస్త్రి పాల్గొన్నారు.

ఎస్‌డీజీ సర్వేపై సమీక్ష నేడు

కోటవురట్ల : సంతులిత అభివృద్ధిగోల్స్ సర్వేపై సోమవారం సమీక్ష నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి వివరాలతో అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఎంఎస్‌కేలు,కార్యదర్శులు పాల్గొనాలన్నారు.

కవచాలంకృతునిగా ధ్యాన వేంకటేశుడు


కశింకోటలో కవచాలంకృత ధ్యాన వేంకటేశుడు

కశింకోట : వైశాఖ శుద్ధ తృతీయ పురస్కరించుకుని ఆదివారం కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామిని కవచాలంకృతుని చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి చరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

విలీన గ్రామాల్లో ‘గడప గడపకు’ నేడు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జీవీఎంసీ విలీన గ్రామాలైన వల్లూరు, గొర్లివానిపాలెంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

యాదవ సంక్షేమ భవన నిర్మాణానికి కృషి

అనకాపల్లిటౌన్ : పట్టణంలో యాదవ సంక్షేమ సంఘానికి సొంత కార్యాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోడి వెంకటరావు అన్నారు. స్థానిక గొల్లవీధి సీతారామాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘానికి న్యాయసలహాదారుగా అయితా సన్యాసిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఒమ్మి కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు బర్నికాన శ్రీను, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి గోవింద, పట్టణ గౌరవాధ్యక్షుడు నమ్మి రామారావు, సంఘ ప్రతినిధులు పల్లా సత్తిఅప్పారావు, బొట్టా చిన్న యాదవ్, కోరుకొండ కన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్ 8 యూనిట్లు, ఏబి పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 312 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 264 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

